ఇచ్ఛాపురం నుంచి తడ వరకు బడాబాబులకు పందేరం

# ప్రజల జీవనోపాధిని హరించే అభివృద్ధి పథకాలు, ప్రాజెక్టులను వ్యతిరేకిద్దాం

**తూ**ర్పుతీరంలో ఆ చివర విశాఖపట్నం నుంచి ఈ చివర కృష్ణపట్నం దాకా ఇప్పుడు పోర్టుల సందడి కన్పిస్తున్నది. పొడవైన సముద్రతీరం ఉన్నప్పటికీ రాష్ట్రంలో నౌకాశ్రయాల నిర్మాణం, అభివృద్ధి ఇప్పటిదాకా అంతంత మాత్రంగానే ఉండేది. ప్రైవేటు రంగంలో పోర్టులు అభివృద్ధి చేయాలని ప్రభుత్వం సంకల్పించిన తరువాత అనేక సంస్థలు పోర్టులు నిర్మించేందుకు సిద్ధం అయ్యాయి. సరుకు రవాణాలో ఇప్పటివరకు విశాఖపట్నం పోర్టు దేశంలోనే అగ్రస్థానంలో ఉంది. సామర్థ్యపరంగా ఇప్పుడు దాన్ని అధిగమించే విధంగా ప్రైవేటు పోర్టుల నిర్మాణం సాగుతోంది. ఇందులో త్వరితగతిన నిర్మాణం పూర్తి చేసుకొని ప్రారంభం అయిన ఘనత కృష్ణపట్నం పోర్టుది. ఓబుళవారిపాలెం నుంచి కృష్ణపట్నం వరకు రైల్వే లైను నిర్మాణం పూర్తికావస్తున్నది. కృష్ణపట్నం వరకు రైల్వే నిర్మాణం పూర్తయి, ఆ తరువాత పోర్టు ఆవరణలో స్టయిడింగ్‌ను ఏర్పాటు చేసే యోచన ఉంది. కృష్ణపట్నం పోర్టులో మొత్తం 41 బెర్తులను, 10,000 కోట్ల రూ. పెట్టుబడితో నిర్మించాలని ప్రతిపాదన. రెండోదశ నిర్మాణం పూర్తయితే దాదాపు 100 మిలియన్ల టన్నులు సరుకు రవాణా అవుతుందని అంచనా. ఆ తరువాత మరో నాలుగేళ్ళకు 200 మిలియన్ టన్నుల స్థాయికి చేరుకుంటుందని కూడా అంచనా. కొలంబో, చెన్నై వెళ్ళే నౌకలన్నీ కృష్ణపట్నంకు వచ్చే అవకాశం ఉంది.

విశాఖపట్నంలో రెండవదయిన గంగవరం పోర్టు మొదటి దశ నిర్మాణం పూర్తికావచ్చింది. 'పూర్తి యాంత్రీకరణ'తో (మనుషులతో పనిలేకుండా) అత్యంత అధునాతన సదుపాయాలతో భారీ నౌకల రాకపోకలకు అనుగుణంగా దీన్ని నిర్మిస్తున్నారు.

కాకినాడలో ఇప్పటికే ఒక నౌకాశ్రయం ఉండగా భీమవరం సమీపంలో, రాష్ట్రానికి చెందిన ఫార్మా యాజమాన్యం వీడియోకాన్ గ్రూప్‌తో కలిసి మరొక పోర్టు నిర్మించనుంది.

మచిలీపట్నంలో మైటాస్ ఇన్‌ఫ్రా నిజాంపట్నం / వాడరేవులలోని నౌకాశ్రయాలను విస్తరించే దిశగా రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకొంటున్నాయి. వచ్చే అయిదు నుంచి పదేళ్ళలో ఇవి పాక్షికంగా నిర్మాణం పూర్తి చేసుకొని సరకు ఎగుమతులకు దిగుమతులకు సిద్ధమయ్యే అవకాశం ఉంది.

ఇంతకు ముందు ఇచ్చిన 2500 ఎకరాల భూమి కాకుండా 'పారిశ్రామిక పార్కు' పేరుతో మరలా

11 వేల ఎకరాల భూమిని కృష్ణపట్నం పోర్టు కంపెనీకి అప్పగించారు. పారిశ్రామిక పార్కు కోసం అని ఎ.పి.ఐ.సి.సి. నుంచి అందిన లేఖ మేరకు కోట మండలంలోని సిద్ధరం, కొత్తపట్నం, కర్లపూడి గ్రామాల్లో, చిల్లకూరు మండలంలోని తూర్పు కనుపూరు గ్రామంలో 5,265 ఎకరాల ప్రభుత్వ భూములను జిల్లా యంత్రాంగం ఇప్పటికే గుర్తించింది. ఇవి కాకుండా మరో 6000 ఎకరాల భూమిని గుర్తించి సేకరించాలని ఎ.పి.ఐ.సి.సి. జిల్లా అధికారులను కోరింది. కొత్తగా సేకరించిన భూముల్లో ప్రభుత్వ, అసైన్డ్ తదితర రకాలు వున్నాయి. తొలుత గుర్తించిన 5,625 ఎకరాల భూమిలో 2,683 ఎకరాలను సెప్టెంబరు నెలలోనే ఎ.పి.ఐ.సి.సి. తన ఆధీనంలోకి తీసుకొంది. పేరుకి ఇది ప్రభుత్వ భూమే అయినా అందులోని చాలా భాగంలో పేదలు – ముంతమామిడి, సరుగుడు చెట్లు పెంచుతూ ఉపాధి పొందుతున్నారు. ప్రభుత్వ చర్యల ఫలితంగా వారు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉంది. తమ ప్రాంతంలో 6,200 ఎకరాల భూమిని సేకరిస్తున్నారని తెలిసినప్పటి నుండి కోట, చిల్లకూరు మండలాలలోని పలు గ్రామాల పేద రైతులు ఆందోళన చెందుతున్నారు. తమ ఇష్టాఇష్టాలతో పనిలేకుండా, గ్రామ సభలు నిర్వహించి తమ అభిప్రాయాలను పరిగణనలోనికి తీసుకోకుండా, ఎందుకోసం భూములు సర్వే జరుపుతున్నారన్నది తెలుపకుండా వారి వద్ద వున్న అసైన్డ్, డికేటి పట్టాలను, పాసు బుక్‌లను, రికార్డులను, హద్దులు పోల్చుకోవాలనే నెపంతో, స్వాధీనం చేసుకొన్నారు. దీంతో వారి భూములకు సంబంధించి ఎటువంటి ఆధారాలు వారి వద్ద లేకుండా అయ్యాయి. ఇప్పటివరకు చెట్టు, పుట్ట కొట్టుకొని, వ్యవసాయం చేసుకొని జీవిస్తున్న వారి వద్ద నుండి భూములను లాగేసుకొంటే ఏమి చేయాలో తోచని పరిస్థితులలో వారు వున్నారు. సవక, ముంతమామిడి, తాటి చెట్లు ఈ గ్రామాల ప్రజలకు జీవనాధారాన్ని కలిగించేవి. వాటిని వారికి లేకుండా చేసారు.



ముందు బకింగ్‌హామ్ కాలువకు తూర్పు ప్రాంతంలో మాత్రమే సర్వే జరిపి భూమిని సేకరిస్తామని చెప్పిన అధికారులు ఆ తర్వాత కోట మండలంలోని కర్లపూడి, కాకోరిపాళెం, వేళ్ళపాళెంలలో, చిల్లకూరు మండలంలో తూర్పు కనుపూరు పంచాయితీలోని ఈదలవారిపాళెం, కొమరావారిపాళెం, పోసినవారిపాళెం, రావలపాళెం, కనుపూరు గ్రామాలలో సెంటు భూమిని కూడా మిగల్చకుండా సర్వే జరిపినట్లు తెలిసింది. గ్రామాల చుట్టూ భూమిని తీసుకొంటే గ్రామాలను మాత్రం ఖాళీ చేయించకుండా వుంటారా? అన్న భయాన్ని ఆ గ్రామాల ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.

మామూలుగా ప్రతి పోర్టుకు ఇరువైపులా 30 కి.మీ.ల తీరాన్ని దాని పరిధిగా నిర్ణయిస్తారు. అలాగే కృష్ణపట్నం పోర్టుకు ఇరువైపులా 30 కి.మీ. తీర ప్రాంతాన్ని దాని పరిధిగా నిర్ణయించారు. ఆ తరువాత భవిష్యత్ అవసరాల కోసం పోర్టు పరిధిని విస్తరించాలని కె.పి.సి.యల్. ప్రభుత్వాన్ని కోరింది. కోరిందే తడవుగా ప్రభుత్వం ప్రకాశం జిల్లా వాడరేవుకు ఉత్తర భాగంలో 30 కి.మీ. పోను, క్రిష్ణపట్నం వరకు గల మొత్తం 85 కి.మీల. మేర తీరప్రాంతం మీద ప్రత్యేక హక్కులు కల్పిస్తూ ఆదేశాలు జారీ చేసింది. వాడరేవు నుంచి క్రిష్ణపట్నం వరకు తీరప్రాంతమంతా కె.పి.సి.యల్. ఆధీనంలోకి వచ్చింది. ఇక మత్స్యకారుల

బ్రతుకులు, సముద్రం మీద వేట ఇవన్నీ కలలే. భారీగా పెట్టుబడులు పెట్టిన కంపెనీలు నష్టపోకూడదనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ప్రత్యేక హక్కులు కల్పించిందని అధికార వర్గాలు చెబుతున్నాయి.

మరి నిజమే కదా! ఒక మత్స్యకారుడు, ఒక పేద రైతు, ఒక రైతు కూలీ, అనేక చేతివృత్తుల వాళ్ళు నష్టపోయినా, నాశనమయినా ఇబ్బంది లేదు. భారీగా పెట్టుబడులు పెట్టిన కంపెనీ పాపం నష్టపోతే ఎలా? ఎంత ఉదార ప్రభుత్వం ఇది. ఈ నిర్ణయంతో మత్స్యకారుల జీవనోపాధికి మరింత ప్రమాదం ఏర్పడింది. రేవుల పరిసరాల్లో చేపల వేట నిషేధం అమల్లో ఉంది కాని మొత్తం ఆ ప్రాంతమంతా చేపల వేటను నిషేధిస్తే తమ పరిస్థితి ఏంటని మత్స్యకారులు వాపోతున్నారు.

## థర్మల్ విద్యుత్ ప్రాజెక్టులు

దేశంలోనే అతి పెద్ద థర్మల్ విద్యుత్ ఉత్పాదక కేంద్రంగా కృష్ణపట్నం ఆవిర్భవించనుంది. తొలి దశగా ఎ.పి.జెన్‌కో నిర్మించ తలపెట్టినది దామోదరం సంజీవయ్య థర్మల్ విద్యుత్ కేంద్రం. ఈ థర్మల్ విద్యుత్ కేంద్రం తొలి దశలో 1600 మెగావాట్ల సామర్థ్యం కలిగిన కేంద్రంగా పని ప్రారంభించనుంది. నేలటూరు కేంద్రంగా ఈ విద్యుత్ కేంద్రాన్ని 1350 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్నారు. తరువాతి దశలో మరో 2400 మెగావాట్లకు ఉత్పత్తి స్థాయిని పెంచనున్నారు.

రిలయన్స్ కంపెనీ అయితే ఏకంగా 4000 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ప్రారంభించనున్నది. ఈ ప్రాజెక్టుకు 2625 ఎకరాల భూమిని కేటాయించారు. ఇవి కాక నవయుగ సంస్థ ఆధ్వర్యంలో 2000 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ప్రాజెక్టు ఒకటి సింహపురి ఎనర్జీ సంస్థ వారి 540 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ప్రాజెక్టు ఒకటి, మీనాక్షి సంస్థ వారి 540 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ప్రాజెక్టు ఒకటి, కీనేటి సంస్థవారి 1080 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ప్రాజెక్టు ఒకటి ప్రారంభం కానున్నాయి.

ఈ ప్రాజెక్టులన్నీ పూర్తి అయితే 12160 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. ప్రస్తుతం మన రాష్ట్రం మొత్తం మీద ఉత్పత్తి అవుతున్న థర్మల్ (బొగ్గు ఆధారిత) విద్యుత్ 12381 మెగావాట్లు. అంటే ప్రస్తుతం మన రాష్ట్రం మొత్తం మీద ఉత్పత్తి అవుతున్న థర్మల్ విద్యుత్‌కి ఇంచుమించు సమానంగా, ఒక్క కృష్ణపట్నంలోనే ఉత్పత్తి అవుతుంది. వీటికోసం భూసేకరణ, మౌలిక సదుపాయాల ఏర్పాటు పనులన్నీ చకచకా జరిగిపోతున్నాయి. కానీ ఈ భూమి మీద ఆధారపడి జీవించే ప్రజల మాటేంటి?

పర్యావరణం విషయానికి వస్తే ఇప్పటికే కృష్ణపట్నం పోర్టు ద్వారా ఇతర దేశాలకు ఎగుమతి చేసేందుకు జరుగుతున్న ఐరన్ ఓర్ రవాణా మరియు డంపింగ్‌ల వల్ల పర్యావరణం పూర్తిగా పాడవుతోంది. రవాణా జరిగే దారి పొడవునా ఐరన్ ఓర్ ధూళివలన పచ్చటి పొలాలు ఎర్రబారాయి. జల కాలుష్యం జరుగుతోంది. ఎడ తెరిపిలేని రవాణా కారణంగా రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్న వారి సంఖ్య రోజు రోజుకూ పెరిగిపోతున్నది. దీన్ని గురించి అనేక ప్రజా సంఘాలు ఆందోళన చేస్తూనే ఉన్నాయి. అయినా ప్రభుత్వం పట్టనట్టు ఉంది. ఉప్పు పరిశ్రమ కూడా దెబ్బతింటుంది.

ఇన్ని థర్మల్ పవర్ ప్రాజెక్టులకు అవసరమైన బొగ్గును ఇతర దేశాల నుంచి పెద్దఎత్తున దిగుమతి చేసుకోనున్నారు. ఆ బొగ్గు నిల్వలతో కృష్ణపట్నం నిండిపోతుంది. విద్యుత్ ఉత్పత్తికి వినియోగించే బొగ్గు వలన కాలుష్యం, బూడిద పరిసర గ్రామాలని, పొలాలని, నీటి చెరువులను, సముద్ర జలాల్ని, భూగర్భ

జలాలను సైతం కలుషితం చేస్తాయి. వాయు కాలుష్యం, జలకాలుష్యం, పర్యావరణ కాలుష్యం అన్నీ కలిసి కృష్ణపట్నం పరిసరాలన్నీ కాలుష్యంతో నిండిపోతాయి. పేద ప్రజలు సరియైన గాలి, నీరు, ఆహారం అందక రోగాల బారిన పడి తమ జీవితాలు చాలించాల్సి వస్తుంది. పర్యావరణ సమతౌల్యం దెబ్బతిని అనేక విపరీత పరిణామాలు చవి చూడాల్సి వస్తుంది.

ఇదికాక చిల్లకూరు మండలంలోని చింతవరం కొత్తపాళెం గ్రామం వద్ద 714 ఎకరాల విస్తీర్ణంలో 600 కోట్లతో మాస్ హోల్డింగ్ వస్త్ర పరిశ్రమ, మండలంలోని అంకుల పాటూరు గ్రామంలో 151 ఎకరాల విస్తీర్ణంలో 550 కోట్ల పెట్టుబడితో యస్.బి.క్యు ఉక్కు పరిశ్రమ, మేనకూరులో 5000 ఎకరాల విస్తీర్ణంలో టెక్స్‌టైల్ పార్కు, మాంబట్టులో 999.15 ఎకరాల విస్తీర్ణంలో ప్రత్యేక ఆర్థిక మండలి ఏర్పాటు అవుతున్నాయి.

హక్కుల సంఘాలవారు అభివృద్ధికి ఆటంకం కలిగిస్తున్నారు అనే భావన ఒకటి ఉంది. హక్కుల సంఘాలు అభివృద్ధికి ఆటంకం కానేకాదు. పరిశ్రమలు స్థాపించబోయే ప్రదేశాన్ని ఆశ్రయించి జీవించే బడుగు బలహీన సన్న చిన్నకారు రైతుల, మత్స్యకారుల జీవితాలకు, జీవనోపాధికి ప్రత్యామ్నాయ మార్గాలేమిటి అని, వారికి ఏవిధమైన పునరావాసం కల్పిస్తున్నారని, వారు కోల్పోయిన దానికంటే ఎక్కువకాకపోయినా సమానంగానైనా వారికి నివాస, జీవనానికి సంబంధించిన భరోసా ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వానిదని జ్ఞాపకం చేస్తాయంతే. ప్రజల జీవించే హక్కుకు భంగం కలిగించవద్దని కోరతాయి.



పేదల భూములను రకరకాల పద్ధతులలో స్వాధీనం చేసుకొంటున్న ప్రభుత్వం తాజాగా "ప్రజా ప్రయోజనం" పేరిట వారి సాగుభూముల్ని లాక్కునే ఎత్తుగడ అమలు చేయదలచింది. ఇందుకోసం పాత ఉత్తర్వు నొకదానిని విస్తృత పరిచింది. అసైన్డ్ సవరణ చట్టం క్రింద ఆయా ప్రాంతాలను నోటిఫై చేసి అక్కడ అన్యాక్రాంతమైన భూములను నేరుగా తీసుకోవడం మొదటి పద్ధతి. భూములపై కన్నేసిన సంస్థలు ఆయా లబ్ధిదారులతో సంతకాలు చేయించి లేఖలు తెస్తే, భూములను అటువంటి సంస్థలకు ఇచ్చివేయడం రెండవ పద్ధతి. "ప్రజా ప్రయోజనం" పేరుతో సాగు భూముల్ని తీసుకొనేటప్పుడు దానికి ప్రభుత్వ విలువ ఎంత ఉంటే ఆ మేరకు లెక్క కట్టి పేదలకు చెల్లించి భూములు స్వాధీనపరచు కోవడం మూడవ పద్ధతి. ప్రజా ప్రయోజనానికి అవసరమనుకుంటే భూమిని ప్రభుత్వం తిరిగి తీసుకుంటుంది అని భూమిని పంపిణీ చేసేటప్పుడు లబ్ధిదారులకిచ్చే 'డి' పట్టాలో నిబంధన ఉన్నా, దీనికి అనుగుణంగా భూమిని స్వాధీనపర్చుకున్న సందర్భాలు చాలా అరుదు. ఎందుకంటే ఆయా భూములలో పేదలు పంటలు పండించుకుంటూ ఉంటారు. కాని ప్రభుత్వం ఇప్పుడు ఆ సాగుభూములు తీసుకోవడానికి 'డి' పట్టాలోని ఈ నిబంధనను విస్తృతంగా ఉపయోగించదలచింది.

ఈ భూములను లబ్ధిదారులు రాత్రింబవళ్ళు కష్టపడి ఎన్నో వ్యయప్రయాసలకోర్చి సాగుకు అనుకూలంగా మార్చుకొని ఉంటారు. కాబట్టి వారికి మౌలిక విలువ చెల్లించడం సమంజసం అంటూ దాదాపు అయిదేళ్ళ క్రితం 1307 నెంబరుతో ఓ ఉత్తర్వు వెలువడింది. దీనిని ఇప్పుడు వివిధ ప్రాంతాలలో ఉపయోగించనున్నారు. వాడరేవు, నిజాంపట్నం నౌకాశ్రయాలు, పారిశ్రామిక కారిడార్‌కు భూముల కోసం ఈ 1307 ఉత్తర్వును అమలు చేయనున్నారు.

ఇప్పటివరకు సిరులు పండించిన పొలాలు ప్రత్యేక ఆర్థిక మండలుల రాకతో పచ్చదనం కోల్పోయాయి. పరిశ్రమల స్థాపన అనే సాకుతో వేల వేల ఎకరాలు బడా బాబుల పరమౌతున్నాయి. పరిశ్రమల స్థాపనకు నిజంగా వేల వేల ఎకరాలు భూములు అవసరమా?

ఒకవైపు ఈ విధంగా వేలకు వేల ఎకరాలు భూములు సేకరిస్తూనే కోస్తా కారిడార్ కోసం ప్రైవేటు భూమిని ఒక్క ఎకరం కూడా సేకరించలేదని, ఇచ్ఛాపురం నుండి తడ వరకు రోడ్డు మార్గం వేసి అభివృద్ధి మాత్రమే చేస్తున్నామని, ప్రజలు వద్దంటే కోస్టల్ కారిడార్‌ను నిలిపివేస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్. రాజశేఖర్‌రెడ్డి, రాష్ట్ర మౌలిక సదుపాయాల శాఖామాత్యులు మోపిదేవి వెంకటరమణరావు ప్రకటించడం హాస్యాస్పదంగా ఉంది.

కోస్తాకారిడార్‌పై తీవ్ర నిరసనలు వెల్లువెత్తాకే జి.ఓ. నెం. 34ను ప్రభుత్వం రద్దు చేసింది. 8-11-2008న వై.యస్. రాజశేఖర్‌రెడ్డి గారి అధ్యక్షతన జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో ఈ నిర్ణయం తీసుకొన్నారు. వెనుకబడిన తీరప్రాంతాలను అభివృద్ధి చేయాలనే ఉద్దేశ్యంతో తాము జి.ఓ. నెం. 34ను తీసుకొచ్చామని, ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఎలాంటి ఇబ్బంది లేకుండా తీరప్రాంత ప్రజలను కాపాడేందుకు మాత్రమే ఎక్స్‌ప్రెస్‌వే తరహాలో రోడ్ల నిర్మాణం చేపట్టడానికి జి.ఓ. నెం. 34ను జారీ చేసినట్లు మోపిదేవి ప్రకటించారు.

కోస్తాకారిడార్‌లో పరిశ్రమలకోసం పెద్దఎత్తున భూములు సేకరిస్తారని ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలు దుష్ప్రచారం చేస్తున్నాయని, అందువలన ప్రజలు భయభ్రాంతులకులోనై నిరసనలకు, ఆందోళనలకు దిగిన కారణంగా జి.ఓ. నెం. 34 ను రద్దుచేయవలసి వచ్చిందని, ఈ కారిడార్ ఇంకా అధ్యయన దశలోనే వుందని, ప్రజలు అపోహల తొలగించేందుకే ఆ జీవోను రద్దుచేశామని మోపిదేవి వెంకట రమణారావుగారు ప్రకటించారు. ఇది నిజమేనా?

మరైతే పి.సి.పి.ఐ.ఆర్. కోసం ప్రత్యేక అభివృద్ధి సంస్థ (సి.యస్.డి.ఎ) ను ఏర్పాటు చేసిన జి.ఓ.నెం. 373 కూడా రద్దుచేయాలి కదా. 24.05.2008న జారీ చేసిన జి.ఓ.నెం. 913ను కూడా రద్దుచేసి రైతుల నుండి సేకరించిన భూములను తిరిగి రైతులకు ఇస్తారా? కాకినాడ సెజ్ కోసం సేకరించిన 10,500 ఎకరాలు, ప్రకాశం గుంటూరు జిల్లాలో వాన్‌పిక్ కోసం సేకరించిన 28,000 ఎకరాలు నెల్లూరు జిల్లాలలో పారిశ్రామిక పార్కుకోసం కోట, చిల్లకూరు మండలాల్లో సేకరించిన 5,265 ఎకరాల భూమిని, వివిధ ప్రాజెక్టులకు, వివిధ కంపెనీలకు కేటాయించిన వేలాది ఎకరాల వ్యవసాయ భూములను, లబ్దిదారులనుండి సేకరించిన అసైన్డ్ భూముల్ని తిరిగి ఆయా రైతులకు స్వాధీనం చేస్తారా?

ప్రభుత్వం అభివృద్ధి పేరున చేపట్టే పథకాలు సాధారణ ప్రజల జీవనోపాధికి, జీవించే హక్కుకు భంగం కలిగించకూడదు. ఇప్పుడు ప్రతిపాదిస్తున్న ప్రత్యేక ఆర్థిక మండళ్ళు, పోర్టులు, పారిశ్రామిక వాడలు, టెక్స్‌టైల్ పార్కులు, పెట్రోకెమికల్ కారిడార్‌లు, థీమ్‌పార్కులు, కెమికల్ కాంప్లెక్స్‌లు, ఫార్మా పార్కులు, లెథర్‌పార్కులు, కోస్టల్ కారిడార్ మొదలైనవన్నీ కూడా పెత్తందారులకు, బడాబాబులకు ప్రయోజనం కల్గించేవే. పెద్దల ప్రయోజనం కొరకు, వారి అభివృద్ధి కొరకు తీరప్రాంత ప్రజల జీవనోపాధికి, నివాసానికి, జీవించే హక్కుకు విఘాతం కలిగించడం తగదు.

నెల్లూరు జిల్లాశాఖ, 14-11-2008